క్లుప్తంగా

ప్రచార రథానికి స్వాగతం



ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి సనాతన హిందూధర్మ ప్రచార రథానికి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. వీధుల్లో పసుపు నీరు చల్లుతూ గోవింద నామస్మరణ చేశారు. మంగళవారం రాత్రి రాపాకలోని సీతారామస్వామి ఆలయం వద్దకు ప్రచార రథం చేరుకుంది. అన్నమాచార్య సంకీర్తనతో జోల పాటతో శ్రీవారిని నిద్రపుచ్చి, బుధవారం ఉదయం మేళతాళాలు, కోలాట నృత్యాలు, భజన బృందాలతో రథయాత్ర కొనసాగింది.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

బిక్కవోలు: మండలంలోని ఖాళీగా ఉన్న 13 వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ బుధవారం తెలిపారు. బిక్కవోలు1, కొమరిపాలెం 8, బలభద్రపురం 2, ఊలపల్లి 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని, ఆసక్తి, అర్హత కలవారు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేయడంతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయం అందించాలన్నారు.

ఈక్రాప్ నమోదు 91 శాతం పూర్తి

పెదపూడి: ఈక్రాప్ నమోదు ప్రక్రియ మండలంలో 91 శాతం పూర్తయిందని మండల వ్యవసాయశాధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. కాండ్రేగుల రైతు భరోసా కేంద్రంలో ఈక్రాప్ నమోదు ప్రక్రియకు సంబంధించి 1బీ, ఇతర రికార్డులను ఆయన బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 18 వేల ఎకరాలకు ఇప్పటి వరకు సుమారు 16,350 ఎకరాల్లో పూర్తయిందన్నారు. 11,225 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 8,200 మంది (53 శాతం) రైతులు వేలి ముద్రలు సేకరణ పూర్తయ్యిందన్నారు. ఈనెల 20 నాటికి మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు.

కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లు అందజేస్తున్న దాతలు

బిక్కవోలు: స్థానిక భవిత కేంద్రానికి దాతలు రెండు కంప్యూటర్లను బహూకరించారు. గ్రామానికి చెందిన కాళా నరేష్ తన అమెరికా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో కలసి బుధవారం భవిత కేంద్రాలను సందర్శించారు. అనంతరం కాకినాడ చెందిన ఎ.నాగరాజు రెండు కంప్యూటర్లు అందించారు. అమెరికా చెందిన లన్ హన్సెన్, బెన్ వర్షెస్, రిచా మిశ్రా, సరహ బ్రదర్స్ పుస్తకాలతో కూడిన కిట్లు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, భవిత ఉపాధ్యాయుడు డి.సన్యాసిరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బెడ్ వితరణ



మెడికల్ బెడ్ అందజేస్తున్న దృశ్యం

అనపర్తి: కుతుకులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గ్రామానికి చెందిన సొసైటీ అధ్యక్షుడు పడాల వెంకటరెడ్డి బ్రదర్స్ మెడికల్ బెడ్‌ను అందజేశారు. తన తండ్రి పడాల దేవారెడ్డి జ్ఞాపకార్థం పడాల వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి రూ.45 వేలు విలువగల బెడ్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నల్లమిల్లి దుర్గా వరప్రసాదరెడ్డి (ఎన్‌డీఆర్) చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు పులగం వీరవెంకటసత్యనారాయణరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చాందిని కుమార్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి గ్రామోత్సవం

రంగంపేట: మెళ్లూరులోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మేలు కొలుపుతో కార్యక్రమాలు ప్రారంభించారు. పంచామృతాభిషేకం, తమలపాకుల పూజ నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దూలం నాగేశ్వరరావు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

మధురపూడి: సమాజంలోని ఇతరులపై క్రైస్తవులు సహోదర ప్రేమను కనబర్చాలని రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ అన్నారు. బుధవారం కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపదేశి కొల్లి యేకోబు, సంఘ పెద్దలు గెడ్డం రత్నం, కాతేటి జార్జి, దూళ్ల సుబ్బారావు, చుక్కా శ్యామల పాల్గొన్నారు.

చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు..

- నరేంద్రపురం హైస్కూల్లో రోబోటిక్ ప్రదర్శన
- ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు



విద్యార్థులు తయారుచేసిన రోబోలతో ఉపాధ్యాయులు

రాజానగరం: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి, తగిన ప్రోత్సాహన్నిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారని మండలంలోని నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన రోబోటిక్ ఎగ్జిబిషన్ నిరూపిస్తోంది. ఈ పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదువుతున్న కొందరు విద్యార్థులు.. ఉపాధ్యాయులు చెప్పిన మార్గదర్శకాలను అనుసరించి, తమ ఆలోచనలతో రూపొందించిన చిన్నపాటి రోబోలు పలువురి సందర్శకులు ప్రశంసలను కూడా అందుకుంటున్నాయి. విద్యార్థిలో ఉండే ఆసక్తిని గుర్తించి, ప్రోత్సహించడంతో పాటు నూతనావిష్కరణలకు నాంది పలికే రీతిలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటుచేసే అవకాశం కల్పించింది. ఈ ల్యాబ్‌ని వినియోగించుకుంటూ కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు తీసుకుని ఈ రోబోలను తయారుచేశారు.

ఎన్నో ఉపయోగాలు

వ్యవసాయంలో వరి నారు వేయడం, నాట్లు వేయడం పరిపాటి, అయితే నేరుగా పొలంలోనే వరి విత్తనాలను నాటే సీడ్ సోయింగ్ రోబోట్‌ను విద్యార్థులు తయారు చేశారు. దీనికి మరిన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తే నిజంగా వ్యవసాయ రంగంలో రైతాంగానికి ఎంతగానో మేలు చేకూర్చుతుందని సందర్శకులు చెబుతున్నారు. అలాగే గృహాలు, కార్యాలయాలు తదితర వాటిని నిత్యం శుభ్రం చేయడానికి మహిళలు ఎంతగానో కష్టపడుతుంటారు. ఇందుకు కూడా ఈ విద్యార్థులు ఫ్లోర్ క్లీనింగ్ రోబోట్ తయారు చేసి అబ్బురపరిచారు. ప్రయాణంలో శ్రమను తగ్గించేలా స్మార్ట్ ట్రాలీని రూపొందించారు. బ్యాటరీ సాయంతో పనిచేసే ఈ ట్రాలీ రోబో అందులో అమర్చిన చిప్‌ను బట్టి సదరు వ్యక్తి వెనుకనే ఆటోమేటిక్‌గా పయనిస్తుంది. డ్రైవర్ లెస్ వెహికల్ రోబోట్, వాయిస్ కంట్రోలింగ్ రోబోట్, సెర్వ్ రోబోట్, ట్రిక్కింగ్ వెహికల్ రోబోట్.. ఇలా ఆ విద్యార్థులు తమ ఆలోచనలతో తయారు చేసిన రోబోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

సృజనాత్మకతకు పదును

విద్యార్థుల్లో సృజనాత్మకతకు మరింత పదును పెట్టి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చనే ఆలోచనతో మా ఉపాధ్యాయులు, ప్రాజెక్టు నోడల్ అధికారి ఆనంద్ సహకారంతో ఈ రోబోటిక్ ప్రదర్శనను ఏర్పాటు చేశాం. విద్యార్థులలో ఉండే మంచి ఆలోచనలను గుర్తించి, ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారు.

– ఎస్. ఉషారాణి, ప్రధానోపాధ్యాయురాలు, నరేంద్రపురం హైస్కూలు

ఉపాధ్యాయుల ప్రోత్సాహం

విద్యార్థులు సైన్స్ పరంగా నూతనావిష్కరణలు చేసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న ప్రయత్నం చాలా బాగుంది. వారిచ్చే ప్రోత్సాహంతోనే ఈ చిన్నారులు ఇటువంటి అద్భుత రోబోలను తయారు చేశారనడం అతిశయోక్తి కాదు. ఇలాగే ప్రోత్సాహం ఉంటే వీరిలో కొందరు మంచి సైంటిస్టులు కావచ్చు.

– పంపన శ్రీను, సొసైటీ చైర్‌పర్సన్, నరేంద్రపురం

నేడు ఎమ్మెల్యే రాజా పర్యటన

రాజానగరం: మండలంలోని ముక్కినాడలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం జరిగే విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఉదయం 9.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారు. అనంతరం 10.45 గంటలకు రాధేయపాలెం, 11.30 గంటలకు వెలుగుబందలో ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులకు శంకుస్థాపనలు చేస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోరుకొండలో ఆ మండలానికి సంబంధించిన గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో సమావేశమవుతారు.

నవోదయ దరఖాస్తులకు గడువు పెంపు

అనపర్తి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువు తేదీని పెంచినట్లు ఎంఈఓ కె.స్వామి నాయక్ తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 15 వరకు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేయవచ్చునని, ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల్లో తప్పులు ఉంటే ఈనెల 16, 17 తేదీల్లో ఎడిట్ ఆప్షన్ (ఆన్‌లైన్ విండో) ద్వారా సరి చేసుకోవచ్చన్నారు. ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 29న పరీక్ష జరుగుతుందన్నారు.

జగన్ ప్రభుత్వంలో పారదర్శక పాలన



పందలపాకలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పందలపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం

బిక్కవోలు: రాష్ట్రంలో సీఎం జగన్ పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పందలపాకలో బుధవారం ఐదోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలు అందుతున్నాయన్నారు. జగన్‌మోహనరెడ్డిని ప్రజలు 2024లో మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీలు కర్రి గీతాసావిత్రి, మచ్చా పాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కొంకుదురు పీహెచ్‌సీ సభ్యులు యాసలపు శ్రీనువాస్, సచివాలయం కన్వీనర్ పాలచర్ల అబ్బు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, వార్డు సభ్యులు పోతురాజు వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైఎస్సార్ సీపీ చిపురపల్లి ఆనందరావు, రెడ్డి సత్తిరాజు, రొంగల అప్పాజీ పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- తొర్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం



తొర్రేడులో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. తొర్రేడు గ్రామ సచివాలయం–1 పరిధిలో రెండోరోజు బుధవారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చందన నాగేశ్వర్ పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి 350 కుటుంబాలను కలిశారు. వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. సీఎం జగనన్న ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నారని పింఛన్ అందుకుంటున్న వృద్ధులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని చందన నాగేశ్వర్ చెప్పగా.. తమ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి సీతాపతిని వీధిదీపాలు సమస్యలను పరిష్కరించాలని చందన నాగేశ్వర్ ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం త్వరితగతిన చేపడతామన్నారు. సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని దేశంలో మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పులూరి రాంబాబు (రాము), సొసైటీ అధ్యక్షులు చిట్టూరి వెంకటరావు, సభ్యులు దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు, దాసరి గోపాలకృష్ణ, మిరియం నెహ్రూ, మెప్పెల్లి రాజు, మంగం శేఖర్ బాబు, చోడదాసి రాహుల్, గద్దె శ్రీనివాస్ చౌదరి, చిట్టూరి సత్యనారాయణ, బొల్లిన రామకృష్ణ, రెడ్డి చంటి, పాలడుగుల శ్రీధర్, షేక్ గౌసియా బేగం, పోలిన శ్రీను, పాత్రగడ వెంకట్రావు, అలీ సలార్ పాల్గొన్నారు.

ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



మర్రిపూడిలో ఆశ్రమాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: మర్రిపూడిలో నిర్మించిన శివరామకృష్ణ దీక్షిత అచల ఆశ్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బుధవారం సందర్శించారు. వాస్తవానికి ఈనెల ఒకటో తేదీన సందర్శించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయారు. ఆశ్రమ విధి విధానాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ఇది చాలా అరుదైన ఆశ్రమంగా అభివర్ణించారు. కేవలం మహిళా భక్తులు సుందరమైన ఆశ్రమాన్ని నిర్మించుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పుట్టా సోమన్న చౌదరి, వేము చిరంజీవి, ఆశ్రమ నిర్వాహకులు అనంతలక్ష్మి పాల్గొన్నారు.

ఐక్యత లేకపోతే జెండాలు మోసేందుకే బీసీలు



సమావేశానికి హాజరైన బీసీ నాయకులు

రంగంపేట: ఐక్యత లేకపోతే వివిధ పార్టీల జెండాలు మోసేందుకే బీసీలు మిగిలిపోతారని బీసీ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, గురజారపు వీరభద్రరావు అన్నారు. బాలవరం గ్రామంలో బుధవారం జరిగిన బీసీల సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. బీసీల కంటే తక్కువ శాతం ఉన్న రెడ్డి, కమ్మ, కాపులకు మాత్రమే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు దక్కుతున్నాయన్నారు. వివిధ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయన్నారు. ఇందుకు ప్రధాన కారణం బీసీల్లో ఐక్యత లేకపోవడమేనని అన్నారు. 136 కులాలతో 60 శాతం ఉన్న బీసీలందరూ కలసికట్టుగా ఉంటే రాజ్యాధికారం సాధించవచ్చన్నారు. అందుకోసమే అన్ని గ్రామాల్లో వివిధ కులాల్లో ఉన్న బీసీలను ఏకతాటిపైకి తేవడానికి సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు కేతా సత్తిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో రంగంపేట ముందంజ

రంగంపేట: జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగులో రంగంపేట మండలం దూసుకుపోతోందని రుచిసోయా–పతంజలి ఆయిల్ పామ్ పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర అన్నారు. బుధవారం మండలంలోని మర్రిపూడిలో జరిగిన రైతు శిక్షణ శిబిరానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లాలో ప్రస్తుతం రాజానగరం మండలం 7,800 ఎకరాలతో ప్రథమ, 7500 ఎకరాలతో రంగంపేట మండలం ద్వితీయ స్థానంలో ఉన్నాయన్నారు. మండల ఉద్యానవన అధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ గొట్టపు బావులున్న మెట్టరైతులందరూ వరికి బదులుగా లాభసాటిగా ఉన్న ఆయిల్ పామ్ సాగుకు మళ్లాలన్నారు. ఆయిల్ పామ్ కంపెనీకి చెందిన శాస్త్రవేత్త, సీనియర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధిక దిగుబడులు కోసం పలు సూచనలు చేశారు. రంగంపేట మండలంలో సగటు దిగుబడి ఆశాజనకంగా ఉందని, సరైన చర్యలు తీసుకోవడం ద్వారా ఎకరానికి 12 టన్నుల దిగుబడి సాధించవచ్చునన్నారు. రైతుల తరఫున అభ్యుదయ పామ్ ఆయిల్ సాగు రైతు పట్టా సోమన్న చౌదరి మాట్లాడుతూ టన్ను పామ్ గెలల ధర రూ. 23 వేల నుంచి రూ.13,700కు పడిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మర్రిపూడిలో 1500 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలున్న కారణంగా గెలల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పుట్టా సుబ్బారావు, పి.వీరభద్రరావు, ఎం.సత్తిరాజు విజ్ఞప్తి చేశారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి విగ్రహానికి కరెన్సీ నోట్లతో అలంకరణ

రాజానగరం: చక్రద్వారబంధం దేవీచౌక్‌లోని కనకదుర్గమ్మ ఆలయ 16వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం పురోహితుడు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. అనంతరం నాగవరపు త్రిమూర్తులు, తులసీ దంపతులచే 1500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తదుపరి అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మాత విగ్రహానికి పూలదండలతో పాటు రూ.10 నోట్లతో చేసిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

అనపర్తి: పులుగుర్తలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీవారి దీక్షధారులతో కలిసి గ్రామంలో గోమాత ప్రదక్షిణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అనంతరం శతాధిక ప్రతిష్ఠాపనాచార్య పెదపూడి రఘురామ్ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకుడు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన శేష వాహనంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తాడి గణపతి, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం సందర్భంగా భక్తులకు గరుడ ప్రసాదాన్ని అందజేశారు. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే తప్పక సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

తోకాడలో వైద్య శిబిరం

రాజానగరం: మండలంలోని తోకాడలో నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గండి వెంకట సుజాత ఆధ్వర్యంలో అనపర్తికి చెందిన రమాదేవి ఆస్పత్రి సహకారంతో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కూడా ఉచితంగా చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ వేగెశెట్టి వీవీ చక్రధర రావు శిబిరాన్ని పర్యవేక్షించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన బూలా గౌతమ్ (20) బుధవారం ఉదయం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కె.శుభశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసైన గౌతమ్ తరచూ ఇంటి వద్ద ఘర్షణ పడుతుంటాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మద్యం తగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గౌతమ్ తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి స్వరాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిపై దాడి

సీతానగరం: గ్రామానికి చెందిన 70 ఏళ్ల తవిటికి తాతయ్యలుపై దాడి చేసిన తవిటికి విద్యాసాగర్, బాలాజీపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ బుధవారం తెలిపారు. తాతయ్యలు ఇంటి దగ్గరలో వాలీబాల్ కోర్టు ఉంది. అందులో కొందరు యువకులు ఘర్షణ పడుతుండటంతో ఎందుకు గొడవపడుతున్నారని తాతయ్యలు అడిగాడు. దీంతో అతడి తలపై విద్యాసాగర్, బాలాజీ కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం



అమ్మవారి ప్రతిమను శిరస్సున ధరించి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్

అనపర్తి: కుతుకులూరులో కొలువుతీరిన గ్రామదేవత సత్తెమ్మ తల్లి సంబరాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మాఘమాసంలో అమ్మవారి సంబరం నిర్వహించడం ఆనవాయితీ. గ్రామానికి చెందిన నల్లమిల్లి వంశీకులు అమ్మవారిని తమ ఇలవేల్పుగా, ఆడపడుచుగా కొలుస్తున్నారు. ప్రతి ఏడాది నిర్వహించే ఆలయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారికి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి, సంబరం జరిపారు. అమ్మవారికి పొన్నులు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎన్‌డీఆర్ అమ్మవారి ప్రతిమను శిరస్సున ధరించి గ్రామోత్సవం జరిపారు. ఎస్‌వీసీ కేబుల్ నెట్‌వర్క్ అధినేత అర్జున్ రెడ్డి, బ్రిక్స్ యూనియన్ అధ్యక్షుడు నల్లమిల్లి నాగిరెడ్డి, నల్లమిల్లి వంశీయులు, భక్తులు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో విద్యార్థులకు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శుభ్రత్ కుమార్ సారంగి

మధురపూడి: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్వహించిన విలువిద్య జాతీయ, జోనల్ స్థాయి పోటీల్లో కోరుకొండ మండలం గాడాలకు చెందిన లారెల్ హైగ్లోబల్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఇటీవల పూణే సమీపంలోని పంచఘని ప్రాంతంలో జాతీయ స్థాయి, హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. 14 ఏళ్లలోపు విభాగంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పతకాలను సాధించారు. జాతీయ స్థాయిలో గ్రేడ్–2 నుంచి షణ్ముఖ్ వైభవ్, గ్రేడు–4 నుంచి ఆదిత్ గౌతమ్, 7వ తరగతి నుంచి వెంకట ప్రద్యుమ్న కుడప బంగారు పతకాలు గెలుచుకున్నారు. వెంకట ప్రద్యుమ్న కుడప వ్యక్తిగతం రజత పతకాన్ని కూడా సాధించాడు. జోనల్ స్థాయిలో వెంకట ప్రద్యుమ్న వ్యక్తిగత బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ శుభ్రత్ కుమార్ సారంగి పతకాలను సాధించిన విద్యార్థులను అభినందించారు.

రోడ్డే సరిహద్దు



రాజానగరం, జగ్గంపేట నియోజకవర్గాలను వేరు చేస్తున్న బొల్లెద్దుపాలెం సాయిబాబా గుడి రోడ్డు

మధురపూడి: కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం సాయిబాబా గుడి రోడ్డు రెండు నియోజకవర్గాలకు సరిహద్దుగా ఉంది. ఈ రోడ్డు మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలానికి వెళ్లవచ్చు. ఈ రోడ్డుకు ఇవతల వైపు రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెం, అవతల వైపు జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం గాదెలపాలెం పంచాయతీకి చెందిన వెంకటనగరం గ్రామం ఉన్నాయి. బొల్లెద్దుపాలెంలో 10 వార్డులు, 6 వీధులు, 2,200 మంది ఓటర్లు ఉన్నారు. బలమైన ఎద్దుల పెంపకంలో ఈ గ్రామానికి చెందిన రైతులు దిట్ట.